# జర్నలిస్టు కథలు

ప్రజాగోల స్టార్ రిపోర్టర్ గుర్నాథం వొచ్చేసరికి ఆఫీసు మేఘావృతమై వుంది. మండు వేసవి కాలంలో మేఘాలు రావడం ఏవిటి, వొచ్చినా ఏమాత్రం డిసిప్లిన్ లేకుండా ఆకాశంలో వుండాల్సింది పోయి ఆఫీసులో జొరవడ్డం ఏమిటి అని విస్మయపడుతూ లోపలికి వొచ్చాడు గుర్నాథాం.

కాసేపు కళ్ళు నులువుకుని చూశాక అర్థమైంది అవి మేఘాలు కావని.

ఢిల్లీ రిపోర్టర్ రాజు జె.పి. న్యూసెడిటర్ సుబ్బారావు ఎదురుగా కూచొని సిగరెట్ కాల్చి రైలింజన్ స్థాయిలో పొగ వొదుల్తున్నాడు. ఉక్కిరి బిక్కిరవుతూ కూడా ఏం అనలేక దిక్కులు చూస్తున్నాడు సుబ్బారావు. జె.కె. రాజుగాడు చెప్పేది పంచాపకేశన్ విస్ఫారిత నేత్రాలతో అత్యంత శ్రద్ధానక్తులతో వింటు న్నాడు.

"ఈ పీవీనరసింహారావుతో వేగలేక చస్తున్నాననుకోండి. అమర్త్య రాజీవ్‌గాంధీ పోగానే గురూ నన్ను ప్రధానమంత్రిని చెయ్యవూ అని ప్రాధేయపడ్డాడు. పోనీగదా మన తెలుగువాడని జాలిపడి మనకి తెలిసిన ఎంపీలందరికీ చెప్పి ప్రధానమంత్రిని చేశా. నాల్రోజులు ఆగి మళ్లీ కబురు చేశాడు. బడ్జెట్ ఎలా తయారు చెయ్యాలో చెప్పమంటాడు. నాల్రోజులు నిద్రమానుకుని బడ్జెట్ తయారు చేసిచ్చా. మళ్ళీ మూడు రోజులకి విదేశాంగ విధానం చెప్పమంటాడు. ఇహనాకు చిరాకు పుట్టి నాలుగు చివాట్లు పెట్టాను. అయినా వింటేనా. అమెరికా డావోస్ రమ్మని కూడా పడ్డాడు. చస్తున్నాననుకోండి. నన్ను ఉజ్జోగం చేసుకోనివ్వడం లేదు. ఆర్థిక సంస్కరణలు తయారు చెయ్యమని తగులుకున్నాడు. అవి తయారు చేసేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఇప్పుడు బాధపడుతున్నా అసలు ఈ పీవీని ఎందుకు ప్రధానమంత్రిని చేశానా అని" అంటూ నిట్టూరుస్తున్నాడు- జె.వి. రాజు వురఫ్ జంధ్యాల పోతరాజు.

"జి . మన్మోహన్ సింగ్ అంటే మీరేనా? గ్లాడ్‌టు మీట్‌యూ" అన్నాడు గుర్నాథం.

"గుర్నాథం ఈయన రాజు. మన ఢిల్లీ రిపోర్టరు" అన్నాడు సుబ్బారావు కంగారుగా.

వాడు ఢిల్లీ రిపోర్టరని రాజుకీ తెలుసు

"అరె! మన్మోహన్‌సింగ్ మీరు కారా, చూశారా ఈ పేపర్లలో రాసేది ఏదీ నమ్మలేం. బడ్జెట్టూ, ఆర్థిక సంస్కరణలూ అన్నీ ఆయనే చేస్తున్నారని రాశాయి పేపర్లన్నీ. కానీ నిజం నిప్పులాంటిది ఎప్పుడో ఒహప్పుడు బయటి కొచ్చేస్తుంది. స్వాతంత్ర్యం ఎవరు తెచ్చారు? గాంధీగారే అని టపీమని చెప్పేస్తాం కదా. కానీ




అది శుద్ధ అబద్ధం. స్వాతంత్ర్యం తెచ్చింది మన ఎడిటర్ త్రయంబకం గారట. ఆ సంగతి ఆయనే చెప్పారు. కానీ పేపర్ల వాళ్ళంతా పప్పులో కాలేశారు. గాంధీ అని రాశారు. ఇప్పటికైనా త్రయంబకంగారు మొహమాటం వొదులుకుని, చెప్పబట్టి తెలిసిందిగానీ లేదంటే ఇలా అజ్ఞానంలో కొట్టుకుంటూ వుండిపోయే వాళ్ళమే గదా."

గుర్నాథం డైలాగులు త్రయంబకానికి అర్థంకాలేదు.

సుబ్బారావుకి పూర్తిగా అర్థం అయ్యాయి.

జె.పోత రాజుకి సుబ్బారావు తనని పొగుడుతున్నాడో వేళాకోళం పట్టిస్తున్నాడో అర్థం కాలేదు. ఎందుకైనా మంచిదని గంభీరంగా నవ్వి, మరింత పొగవొదిలాడు.

"పీవీ నరసింగారావు మనకి క్లోజా సార్" అంటున్నాడు పంచాపకేశన్.

"మనకి కాదు నాకు క్లోజు" అన్నాడు రాజు.

"అదేసార్. మనకో చిన్న పని వుంటాయి సార్. మన ఇంట్లో గాస్ లేదు సార్. కట్టెపుల్లల్తో, కిర్సనాయిల్తో మన భార్య నిండా కష్టపడతాది. పీవీ నర్సింగా రావుతో చెప్పి ఒక్కగాస్ కనెక్షన్ ఇప్పిస్తిరా నిండా థాంక్స్‌గా వుంటాము సార్. డబుల్ సిలెండర్ ఇప్పిస్తిరా రొంబ ప్రమాదంగా వుండును సార్" అన్నాడు పంచాపకేశన్.

"అలాగే, ఈసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు మాట్లాడతాలే అంటున్నాడు రాజు.

ఈలోగా లోపలికొచ్చిన త్రయంబకం "ఏవిటీ పొగ? ఏదన్నా అంటుకుందా" అని పొలికేక పెట్టి అంతలోకే రాజుగాణ్ణి చూసి ఆగిపోయాడు. ఈ రాజుగాణ్ణి చూస్తే ఆయనకి కాస్త భయం. వీడు నోరు తెరిస్తే పీవీ నర్సింహారావు, శంకర్‌దయాళ్ శర్మ, ప్రణబ్ ముఖర్జీ, బిల్‌క్లింటన్‌లతో తనూ కూచుని ఎలా అనేక విషయాలు డిస్కస్ చేసేదీ చెపుతూ వుంటాడు. వీడికి నిజంగా పైన పేర్కొన్న వాళ్ళందరితో పరిచయాలు వున్నాయో లేదో తెలుసుకునే మార్గం లేదు. వాళ్ళు తనకి దొరకరు గనక. వీడెప్పుడూ విమానాల్లో తిరుగుతూ వుంటాడు. వేసం కాలంలో ఘోరంగా చమటలు పడుతున్నా ఫుల్‌సూటు విప్పడు. రాజస్థాన్‌లో మధ్యప్రదేశ్‌లో కాంట్రాక్టులిప్పిస్తానని పెద్ద పెద్ద కాంట్రాక్టర్లని కూడా తిప్పుకుంటూ వుంటాడు. వార్తలు మాత్రం పంపడు. వాణ్ణి డిస్మిస్ చేసెయ్యాలని అనేకసార్లు ప్రయత్నం చేశాడు త్రయంబకం. కానీ అవేం ఫలించలేదు.

"ప్రధానమంత్రి ఆఫీసు నించి నేను రామూ దామోదరన్ మాట్లాడుతున్నాను. జె.పి. రాజుగార్ని తీస్తే ప్రధానమంత్రిగారు ఒప్పుకోరు" అని ఫోను వొచ్చింది ఓసారి. త్రయంబకం భయపడి టెర్మినేషన్ కాయితం చించిపడేశాడు. ఆరోజు నించీ వాణ్ణి పీకేసే

జొన్నలగడ్డ రాధాకృష్ణ

ప్రయత్నం చెయ్యలేదు. అయితే ఆరోజు ఫోన్ చేసింది జె.పి. రాజుగాడేనని ఆఫీసులో అందరూ గట్టిగా నమ్ముతున్నారు. కానీ త్రయంబకానికి భయం వీడు పీవీ నరసింహా రావుతో చెప్పి ఎడ్వర్టైజ్‌మెంట్లు ఆపించేశాడే మోనని. ఆరోజు నించి వాడు తను బడ్జెట్ రాశానని చెప్పినప్పుడల్లా, నేనూ తక్కువ వాణ్ణి కాను అని స్పష్టం చెయ్యడానికి, దేశానికి నేనే స్వాతంత్ర్యం తెచ్చాను అని అతనికి నచ్చ జెప్పసాగాడు.

"హలో త్రయంబకం హౌ ఆర్యూ. ప్రైం మినిస్టర్‌గారు మిమ్మల్ని అడిగినట్టు చెప్పమ న్నారు" అన్నాడు రాజు.

"అలాగా! ఇది పాతన్యూస్. పొద్దున్న నాతో ఫోన్లో మాట్లాడారులే" అన్నాడు త్రయంబకం.

"అరె ఆయన ఢిల్లీలో లేరుగా. హరారే వెళ్ళారు" అన్నాడు రాజు.

"నాతో మాట్లాడింది హరారే నించే. అక్కడా టెలిఫోన్లు వున్నాయిగా" అన్నాడు త్రయంబకం.

రాజు గొల్లున నవ్వేశాడు.

"తనతో హరారే రమ్మని ఒకటే గోల. తప్పించుకుని హైదరాబాద్ పారిపోయి వొచ్చేసరికి తల ప్రాణం తోక్కి వొచ్చింది" అన్నాడు రాజు.

"నీకు తప్పింది గానీ నాకు తప్పలేదు. హరారేలో ఇవ్వాల్సిన స్పీచి రాసివ్వమన్నాడు. ఫోన్లో డిక్టేట్ చేశా" అంటున్నాడు త్రయంబకం.

గుర్నాధానికీ సుబ్బారావుకి తమ తమ తలలు గోడకేసి పగలగొట్టుకోవాలని గట్టి కోరిక కలుగుతోంది.

గుర్నాథం కేసి దీనంగా చూశాడు సుబ్బా రావు- ఎలాగైనా ఈ ఇద్దరి నించీ కాపాడమన్నట్టు.

"సార్, రాజు గారు దూరంగా ఢిల్లీలో వున్నారుగదా. మీ లేటెస్ట్ కావ్యం చదివుం డరు. కాసేపు అది వినిపించరాదూ. తెలుగు పొయిట్రీ విని ఎన్నాళ్ళయిందో ఏమో" అన్నాడు.

"వెరిగుడ్ ఐడియా. కమాన్ రాజూ కమ్మని కవిత్వం వినిపిస్తా" అని త్రయంబకం చుట్టూ చూశాడు.

రాజు లేడు ఎక్కడా.

అతను వొదిలిన పొగ మాత్రం వుంది. ●

# సాయి చరితం



శ్రీ సాయిబాబా మొట్టమొదట భక్తుల ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టి వారు సుఖ జీవనం చేసేటప్పు డు వారి మనస్సులను క్రమంగా దైవిక విషయాలవైపు త్రిప్పుతుంటారు. భక్తిప్రేమలు ఎక్కడ ఉంటాయో అక్కడ భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. శ్రీ సాయిబా బాకు భక్తుల పట్ల ప్రేమ ఇంతని చెప్పలేము. ఎవర యితే మూడు పూటలు పూజ చేయకుండా ఉంటా రో వారికి మోక్షం లేదని యోగులు చెప్పి ఉన్నారు.

శ్రీ సాయిబాబా ప్రియభక్తులలో ఒకరిద్వారా బా బాగారు సాక్షాత్కరించే స్థలానికి రావాలని ఒక భక్తునికి సందేశం వచ్చింది. వెంటనే ఆశీర్వాదం ఊదీ ప్రసా దాన్ని ఆ భక్తుడు పొందాడు.

రిక్త హస్తేనో పేయాత్

రాజానం దైవ తమ్ గురుమ్

రాజు దర్శనానికి గాని, దేవుడి దర్శనానికిగాని గురుని దర్శనానికి గాని పోయేటప్పుడు రిక్త హస్తాలతో పోకూడదని శ్రుతి ఆ భక్తునికి జ్ఞప్తికి వచ్చింది. వెంటనే ఒక దానిమ్మ పండును తీసుకొని వెళ్ళాడు. దాన్ని వారి చేతిలో పెట్టిన వెంటనే వారి సమ్మతిని తెలిపేదానికి దాన్ని అక్కడే విరిచి గింజలు తినటం ప్రారంభిం చారు. అలాంటి సమయంలో కొన్ని గింజలు క్రింద పడ్డాయి. మరుసటి రోజు ప్రభాత హారతి సమయంలో అవి ఆ భక్తునికి దొరకటం వల్ల వెంటనే వాటిని ఆతడు తిన్నాడు. ఆటు తర్వాత ఆ భక్తుని దశ తిరిగి, ఐశ్వర్యా లతో తులతూగాడు.

మానవుడు తన అహంకారాన్ని రాల్చుకొన్న ప్పుడు, వానిలో తాను ప్రవేశించి సన్మార్గంతో నడిపిస్తా నని బాబాగారు పలికిన పలుకులు సార్థకమయ్యాయని ఈ సంఘటన ద్వారా రుజువయ్యింది. శ్రీ సాయిబాబా కు ముఖ్యంగా కావల్సింది భక్తి. "మీ పనులను చక్క పెట్టుకోండి, కానీ మనస్సును మాత్రం పక్క లగ్నం చేయండి" అని బాబా వారి వాక్కు. బాబావారికి ఇతర యోగులకు గల తారతమ్యం గ్రహించదగింది. తక్కిన యోగులు అనేక బోధనలు చేశారు. కానీ బాబావారు బోధించిన ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టి దాన్ని అక్కడే నిరూపించారు.

కలియుగంలో సాధనం, యోగం, ధ్యానం సామా న్యులకు సాధ్యపడవు. కాబట్టి, కలియుగంలో మోక్షసా ధనలు, భగవన్నామ స్మరణ చేతనైనంత అన్నదానం అని మరి మరి చెప్తూ, స్వయంగ సప్తాహాలు జరిపించా రు. బాబావారు భిక్ష చేసిన పదార్థాలలో నిత్యం బీదలకు అన్నదానం చేస్తుండేవారు.

(భగవాన్ శ్రీ శిరిడీ సాయిబాబా వారి జీవిత చరిత్ర జగత్ప్రసిద్ధం. అన్ని మతాల వారికి ప్రీతిపాత్రం. వారి జీవిత చరిత్రలో ఎన్నెన్నో భావార్థాలు, గూఢార్థా లు నిక్షిప్తమై వున్నాయి. వాటిని ఆస్వాదించి, ఆచరణ లో పెడితే మనస్సుకు ఎనలేని శాంతి లభిస్తుంది. శ్రీ సాయిబాబా జీవిత చరిత్రము నుండి స్వీకరించినది సికిం ద్రాబాద్ కోనేరు శ్రీ సాయిబాబా మందిర అధ్యక్షుడు శ్రీ శ్రీపతి పాండురంగారావు గారి సహకారంతో.)

— ఎ.ఎస్.కె. చక్రవర్తి.